క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ లవన్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులతో సమావేశమైన ఆర్డీఓ దాసు

నందికొట్కూరు రూరల్: నియోజకవర్గంలో అధికారులు ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయించాలన్నారు. ఓటరు జాబితాల్లో తప్పులు సరిచేయడం, ఓట్లు బదిలీ, తొలగింపులోనూ పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పుల్లయ్య, ఎలక్షన్ డీటీ కిషోర్, డీటీ సోమేశ్వరిలు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి



క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని క్రీడాకారులకు స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందజేస్తామని స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ ఫసిపుల్ మున్నా అన్నారు. పట్టణంలోని స్పోర్ట్స్‌క్లబ్‌లో మంగళవారం వాలీబాల్ క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలో శిక్షణ ఇచ్చామన్నారు. వాలీబాల్ క్రీడాకారులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ గౌరవాధ్యక్షులు ఆర్ నూర్ తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు బదిలీ



సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబును సన్మానించిన ఈఓ, ఉద్యోగులు

మహానంది: మహానంది దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌బాబు బదిలీ అయ్యారు. మూడు నెలల క్రితం జరిగిన బదిలీల్లో కాణిపాకం దేవస్థానం నుంచి ఆయన మహానంది వచ్చారు. అనంతరం ఆయన డిప్యూటేషన్‌పై మంగళవారం బదిలీ అయ్యారు. బదిలీ అయిన శ్రీధర్‌బాబును ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది సన్మానించారు.

సీనియర్ పాత్రికేయుడి మృతి



హనుమంతు(ఫైల్)

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు హనుమంతు (47) మంగళవారం మృతి చెందాడు. ఆత్మకూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ (షటిల్) ఆడుతుండగా గుండెనొప్పి వచ్చింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స అందించే లోపే కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఆయన పార్థీవ దేహాన్ని ఆత్మకూరు పట్టణంలోని సుదర్శన భవనంలో మధ్యాహ్నం వరకు ఉంచారు. అనంతరం మండలంలోని లింగాల గ్రామానికి తరలించారు.

సర్క్యులర్ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వీఓఏల మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని వీఓఏల యూనియన్ జిల్లా కార్యదర్శి మిట్నాల తిరుపతయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని పీడీ శ్రీధర్‌రెడ్డికి అందజేశారు.

యూరియా కృత్రిమ కొరత

- అధిక ధరకు విక్రయిస్తున్న ప్రైవేటు వ్యాపారులు
- ఎమ్మార్పీ కంటే రూ.100 నుంచి 150 వరకు అధికం
- యూరియా కావాలంటే ఇతర ఎరువులు కూడా కొనాలంటూ మెలిక
- ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు



ఆత్మకూరు ప్రైవేట్ దుకాణాలకు లారీలో నుంచి అన్‌లోడ్ చేస్తున్న ఎరువులు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో ప్రస్తుత పరిస్థితుల్లో పైర్లు ఏపుగా పెరిగేందుకు యూరియా అవసరం. దీనిని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తూ దందాకు తెరలేపారు. ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలంలో రైతులకు యూరియా సమస్యగా మారింది. కాగా రైతు భరోసా కేంద్రాల్లో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

టన్నుల కొద్ది నిల్వ ఉన్నా.. లేవని సమాధానం

ఆత్మకూరు పట్టణంలో ఇటీవల జీఎమ్ఆర్ ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రం వద్ద నాగంపల్లికి చెందిన ఓ రైతు యూరియా కావాలని అడగగా ఆ దుకాణంలో ఎరువుల బస్తాలు టన్నుల కొద్ది నిల్వ ఉన్నా...లేవని సమాధానం ఇచ్చారు. దీంతో అతను ఆత్మకూరు వ్యవసాయాధికారులను ఆశ్రయించారు. హుటాహుటిన వారు దుకాణం వద్దకు చేరుకుని రైతు ఫిర్యాదును స్వీకరించారు. అయితే ఎరువులు ఉన్నా..యజమానులు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు యూరియా బస్తా ధర రూ.266.50 పైసలకు విక్రయించాల్సి ఉండగా రూ.100 నుంచి 150 వరకు అధికంగా చెబుతున్నారని ఆరోపిస్తున్నారు.

వర్షాలు కురవడంతో డిమాండ్

ఆత్మకూరు డివిజన్ పరిధిలో దాదాపు నెల రోజుల తర్వాత వర్షాలు కురవడంతో మొక్కజొన్న, వరి, పత్తి పైర్లు ఏపుగా పెరిగేందుకు యూరియా తప్పనిసరి అవసరం . రైతుల అవసరాన్ని ఆసరగా తీసుకుని దుకాణ యజమానులు సొమ్ము చేసుకునేందుకు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. యూరియా ధర ప్రభుత్వ నిబంధనల మేరకు ఎమ్మార్పీ రూ.266.50కి విక్రయించాల్సి ఉండగా రూ.366 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు తప్పనిసరిగా ఇతర ఎరువులైన డీఏపీ, 28280 , 143714, 20-20 0-13, లాంటి ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొంటే తప్పా యూరియాను విక్రయించడం లేదు. ఆత్మకూరు పట్టణంలో ఆగ్రోస్, గ్రోమోర్ తో పాటు పలు ప్రైవేట్‌దుకాణాల్లో యూరియ లేదని చెప్పడం అధిక ధరకు లేదా, ఇతర ఎరువులు కొంటే తప్పా రైతులకు యూరియా ఇవ్వడంలేదు. పట్టణంలో యూరియా దొరక్కపోవడంతో జూపాడుబంగ్లా మండలం పారుమంచాల, పాములపాడు మండలం జూటూరు, కొత్తపల్లి మండలంలోని కొత్త పల్లి , మండలంలోని పలు దుకాణాల్లో యూరియా బస్తా రూ.400లకు పైగా అమ్మకాలు చేస్తున్నారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నప్పటికీ రైతులకు యూరియా దొరకని దుస్థితి ఏర్పడింది.

స్పందించని వ్యవసాయాధికారులు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో పలు దుకాణాల్లో యూరియా కొరగా ఉండడం, వాటిని వ్యాపారస్తులు, దళారులు రైతుల వద్ద అధిక రేట్లకు అమ్మకాలు చేస్తూ దోచుకుంటున్నప్పటికీ స్థానిక వ్యవసాయాధికారులు సకాలంలో స్పందించడం లేదు. దీనికితోడు రైతులకు కావాల్సిన సమయంలో ఎరువులను సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

డివిజన్ పరిధిలోని ఆర్బీకేల్లో 365 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దినిని బస్తా ధర ఎమ్మార్పీ ప్రకారం రూ.266.50లకే అందజేస్తున్నారు. యూరియాతో పాటు ఇతర ఎరువులు కావాల్సిన రైతులు ఆర్బీకేలను సంప్రదించి కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆర్బీకేల్లో యూరియాను కొనుగోలు చేయండి



ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రైతులు యూరియా కోసం ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించవద్దు. ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆర్బీకేల్లోనే కొనుగోలు చేయాలి. కేంద్రాల్లో ఎరువులు లేకపోతే ఇతర ఆర్బీకేల నుంచి అవసరమైన యూరియాను సరఫరా చేస్తాం. ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దు.

– ఆంజనేయులు, ఏడీఏ ఆత్మకూరు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

మిడుతూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి హెచ్చరించారు. మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదులు అందడంతో మంగళవారం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు హాజరై ఫీల్డ్ వర్క్‌కు వెళ్లారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించడంతోపాటు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు.

గాలేరు నుంచి వీబీఆర్‌కు 700 క్యూసెక్కుల నీరు

వెలుగోడు: గాలేరు నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. వీబీఆర్ నుంచి స్లైస్ ద్వారా 130 క్యూసెక్కులు, రిజర్వాయర్ లాస్ నుంచి 60 క్యూసెక్కులు వృథా కాగా మొత్తం 190 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉన్నట్లు చెప్పారు. వీబీఆర్‌లో ప్రస్తుతం 264.700 మీటర్ల వద్ద 7.114 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

15 లోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను ఈనెల 15లోగా రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఆశ్రయించి రైతులు వారు సాగుచేసిన పంటల వివరాలు తెలియజేసి ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి దాకా గ్రామాల్లోని ఆర్బీకేల సిబ్బంది 9వేల ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు.

వర్షం.. రైతన్నల హర్షం

ఆత్మకూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు 33.4 మిమీ వర్షం నమోదైంది. వరుసగా మూడు రోజులు పాటు వర్షాలు కురవడంతో వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు పంటలకు ఎంతగానో ఊరటనిచ్చాయి.

వెలుగోడు: మండలంలోని మూడు రోజుల పాటు వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. ఈ నెల 3వ తేదీ 51.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 4వ తేదీ 18.6 మిల్లీమీటర్లు, 5వ తేదీ 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షంతో మొక్కజొన్న, వరి పంటలకు జీవం వచ్చింది. వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

జూపాడుబంగ్లాలో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షం 6.8 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొత్తపల్లిలో అత్యధికంగా 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పగిడ్యాలలో 3.0 మిల్లీమీటర్లు నమోదైనట్లు తెలిపారు. జూపాడుబంగ్లాలో 6.8 ఎం.ఎం, పాములపాడులో 6.4 ఎం.ఎం, నందికొట్కూరులో 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని చెప్పారు.

అరగంటకోసారి బ్రేక్‌డౌన్

- పదే పదే ట్రిప్ అవుతున్న 80బన్నూరు ఫీడర్
- పరిష్కరించని అధికారులు
- ఇబ్బందుల్లో వినియోగదారులు

జూపాడుబంగ్లా: రెండు రోజుల నుంచి అరగంటకోమారు 80బన్నూరు ఫీడర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుండటంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 80బన్నూరు ఫీడర్ విద్యుత్ లైన్ లోపం తలెత్తటంతో అరగంటకోమారు బ్రేక్ డౌన్ అవుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. ఈ ఫీడర్ కింద తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, చాబోలు, తుమ్మలూరు, కృష్ణరావుపేట గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 2వేల మంది గృహవిద్యుత్ వినియోగదారులు, 250 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగ రైతులున్నారు. రెండు రోజుల నుంచి 80బన్నూరు ఫీడర్ విద్యుత్‌లైన్‌లో సమస్య నెలకొనగా పరిష్కరించడంతో విద్యుత్ సిబ్బంది విఫలమవుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకొని సత్వరమే 80బన్నూరు ఫీడర్ లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి విద్యుత్‌సరఫరాలో అంతరాయం నెలకొనకుండా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రామాచారి వివరణ కోరగా సమస్య ఉన్న మాటవాస్తవమేనన్నారు. సమస్యను పరిష్కరించేందుకు యత్నిస్తున్నామని తెలిపారు.

రక్తహీనతను నివారించాలి

గోస్పాడు: చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎయిడ్స్, టీబీ లెప్రసీ జిల్లాప్రోగ్రాం అధికారి డాక్టర్ శారదాబాయి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత నివారణకు, వయస్సుతో పాటు బరువు పెరగని చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

టాటా మ్యాజిక్ ఢీకొని వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణ శివారులోని మదరసా సమీపంలో టీవీఎస్ ఎక్స్ఎల్ బైక్‌ను టాటా మ్యాజిక్ ఢీకొనడంతో బోయ శంకర్ (36) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు బోయ శంకర్ మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామానికి చెందినవాడు. పట్టణంలో గౌండ పని ముగించుకుని తిరిగి మోటర్‌బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఘటన జరిగింది. భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): 14వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ అబ్దుల్‌మజీద్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన పోటీల్లో నంద్యాల క్రీడాకారులు పలు పతకాలు సాధించారన్నారు. ఎస్.నీరజా అండర్-33 విభాగంలో బంగారు పతకం, ఎం.సానియా అండర్-73 విభాగంలో రజతం, జి.సింధు అండర్-24 విభాగంలో రజతం, జి.పల్లవి అండర్-18 విభాగంలో రజతం, ఎస్.లక్కీ అండర్-26 విభాగంలో కాంస్య పతకాలు సాధించి ఉమ్మడి జిల్లాకు గుర్తింపు తెచ్చారన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ..

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఈనెల 3వ తేదీన కర్నూలులో జరిగిన 11వ నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మార్నింగ్‌స్టార్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించారని కరాటే మాస్టర్ నూర్‌బాషా, హెచ్‌ఎం ఝాన్సీజోసెఫ్‌లు మంగళవారం తెలిపారు. హర్షకుమార్, నిరంజన్, శ్రీరామాంజనేయ, మణిదీప్‌రెడ్డి, వర్షిత్‌కుమార్‌లు వెండి, కాంస్య పతకాలు సాధించారు.

భక్తులను మెప్పిస్తేనే నిజమైన సంతృప్తి

- మహానంది ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి ఘనసన్మానం
- ద్రోణాచార్య అవార్డును అందించిన రామకృష్ణ విద్యాసంస్థలు



ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్, అతిథులు, సిబ్బంది

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులు మెచ్చుకుని ఆనందిస్తే అదే నిజమైన సంతృప్తి అని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి పదోన్నతులు పొంది మహానంది ఈఓగా బాధ్యతలు స్వీకరించిన కాపు చంద్రశేఖర్‌రెడ్డిని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ బాధ్యతలు తీసుకుని రెండేళ్లు పూర్తి కాకముందే ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. నిబద్ధతో, నిజాయితీగా పనిచేస్తూ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి మహానంది ఖ్యాతిని పెంచారన్నారు. అనంతరం రామకృష్ణ విద్యాసంస్థల తరపున ఈఓకు ద్రోణాచార్య అవార్డును అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, ఉపప్రధాన అర్చకులు వనిపెంట జనార్దన శర్మ, ధర్మకర్తలు గంగిశెట్టి మల్లికార్జున, హేమలత, తపిల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కనువిందు !



మహానందిలో నల్లమల, మంచుతో కనువిందు చేస్తున్న దృశ్యం

మహానంది: నల్లమల పచ్చటి అందాలు, పక్షుల కిలకిలరావాలు, జోరుగా కురుస్తున్న వర్షానికి నల్లమలను కప్పేసిన మంచుదుప్పటి దృశ్యాలు భక్తులకు కనువిందు చేశాయి. ఊటీ, కొడైకెనాల్ తరహాలో నల్లమల అడవి అందంగా కనిపించింది. ఆకాశంలోని మేఘాలు కప్పేశాయి. ఆది, సోమవారాల్లో కురుస్తున్న వర్షానికి నల్లమల అడవి మంచుతో మునిగిపోయింది. మహానంది ఆలయం వద్ద మంగళవారం ఈ దృశ్యం కనువిందు చేసింది.









బిజినవేములలో ఉపాధ్యాయుడికి సన్మానం, ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సున్నిపెంటలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళి, ఆత్మకూరు మండలం వెంకటాపురం పాఠశాలలో గురుపూజోత్సవం

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



కొత్తపల్లిలో ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: సమాజాభివృద్ధికి దోహదపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఎంఈఓ 1, 2 మద్దిలేటినాయక్, శ్రీనివాసులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జూపాడుబంగ్లా గురుకుల పాఠశాల, మోడల్‌స్కూల్, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన హరిభోగేశ్వర, శేషన్న, షబానా, మయూరి, రహమాన్ ఫర్హత్‌లను సత్కరించారు. మోడల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి మొక్కలు నాటించారు. కార్యక్రమంలో తర్తూరు హెచ్‌ఎం డి.జాకీర్ హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి తిమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్తు మార్గ నిర్దేశకులు గురువులు

కొత్తపల్లి: విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు మార్గనిర్దేశకులు గురువులేనని ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లాలు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం ఎంఈఓలను సన్మానించారు. గువ్వలకుంట్ల ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం ఉశేనయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం రిటైర్డ్ ఉపాధ్యాయుడు పొన్నంపాటి సత్యానందం దంపతులను సత్కరించారు. మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరి హైస్కూల్ నందు కరస్పాండెంట్ పురుషోత్తమ రెడ్డి, హెచ్‌ఎం వాసుదేవరెడ్డిలు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు.

నందికొట్కూరు: పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్స వ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ నిర్మల కెన్నడి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పగిద్యాల: స్థానిక విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల స్థాయిలో ఎంపికైన ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బిజినవేముల, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు, కొణిదేల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిజినవేముల జెడ్పీ హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడు లవయ్య ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను పూలమాలలు వేసి సన్మానించారు. హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, పీఈటీ వీరన్న పాల్గొన్నారు.

పాములపాడు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు ఆకు, వక్కలు, స్వీట్లతో శుభాకాంక్షలు తెలిపి వారి నుంచి ఆశీర్వాదం అందుకున్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పద్మావతిబాయి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండలంలోని వెంకటాపురం జిల్లా హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో, పట్టణంలోని ప్రగతి హైస్కూల్‌లో పాఠశాల వ్యవస్థాపకులు రాఘవకృష్ణ, ఉపాధ్యాయురాలు శకుంతల రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా గురుపూజోత్సవం

వెలుగోడు: డాక్టర్ రాధాకృష్ణ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గర్వించ దగ్గదని ఎంఈవో బ్రహ్మంనాయక్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, థెరిస్సా పాఠశాల, లిటిల్ ఏంజిల్స్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సెంట్రల్ లొకాలిటీ ఎలిమెంటరీ పాఠశాలలో పూలమాల వేసి నివాళులర్పించారు. హెడ్ మాస్టర్ పగిడిమాన్ రవికుమార్‌ను బీజేపీ నాయకులు సోమిశెట్టి మల్లికార్జున సత్కరించారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డా.హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు.









జూపాడుబంగ్లా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, గురుకుల పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి, గువ్వలకుంట్లలో రిటైర్డ్ టీచర్ సత్యానందం దంపతులకు సన్మానం , కలమందలపాడు జెడ్పీ పాఠశాలలో సర్వేపల్లికి నివాళి